క్లుప్తంగా

కెనరా బ్యాంక్ పునఃప్రారంభం



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ ఆర్‌ఎం లారెన్స్

బ్రహ్మసముద్రం: బొమ్మగానిపల్లి గ్రామంలో బుధవారం కెనరా బ్యాంక్ శాఖను పునః ప్రారంభించారు. ఈసందర్భంగా బ్యాంకు ఆర్‌ఎం లారెన్స్ మాట్లాడుతూ రైతులు, మహిళా సంఘాల సభ్యులు, స్వయం ఉపాధి కోసం యువతకు అతి తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు అందిస్తోందన్నారు. మహిళా సంఘాలకు గరిష్టంగా రూ. 20 లక్షల వరకూ రుణాలు మంజూరు చేస్తామన్నారు. కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సి ఓబుళేషు, అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్ వినయ్, బొమ్మగానిపల్లి సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, వెలుగు ఏపీఎం హుసేన్, సీసీలు కామరాజు, దొణతిమ్మ, బ్యాంక్ మిత్రాలు మల్లేష్, నాగరాజు, శివకుమార్, ఆనిమేటర్లు పాల్గొన్నారు.

పెన్నహోబిలం రథం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న హెచ్‌ఎం రాజేశ్వరి

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి నూతన రథం నిర్మాణానికి పలువురు భక్తులు బుధవారం విరాళాలు అందజేశారు. ఉరవకొండ ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజశేశ్వరి రూ10,101, బెంగళూరుకు చెందిన పత్తిపాటి వరలక్ష్మి రూ.10 వేలు, ఉరవకొండకు చెందిన మీనుగ దంగూరు సుంకన్న రూ.5 వేలు అందజేసినట్లు ఈఓ సాకే రమేష్‌బాబు తెలిపారు. విరాళాలు అందించిన దాతలకు ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడు ద్వారకా నాథాచార్యులు తదితరులు తీర్థ ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మొబైల్ వాహనం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం వీ శేషయ్య సూచించారు. స్థానిక కళాశాలలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొబైల్ వ్యాన్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా వీడియోలను ప్రదర్శించారు. అనంతరం సైబర్ నేరాలకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఎస్పీ వీడియో సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ కె. శ్రీధర్, కె.రవిశంకర్, అధ్యాపకులు శశికిరణ్, సుధాకర్, లక్ష్మీనారాయణ, గురుమోహన్, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

విడపనకల్లు: మండల కేంద్రంలోని మద్యం షాపులను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య బుధవారం పరిశీలించారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. మద్యం షాపులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. అలాగే కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టును పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, ఉరవకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ సూచించారు. బుధవారం ఆయన కొత్తూరు గ్రామంలో మామిడి తోటలను పరిశీలించారు. ఉద్యాన అధికారి కృష్ణతేజ ఎస్సీ, ఎస్టీ రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు సబ్సిడీతో అందజేస్తామన్నారు. మల్చింగ్, స్టేకింగ్ పద్ధతిలో కూరగాయలు సాగుచేసే రైతులకు 50 రాయితీ అందజేస్తామన్నారు. కేవీకే శాస్త్రవేత్త యుగంధర్, అగ్రికల్చర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



బీటీపీ రోడ్డులోని జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇళ్లు



కళ్యాణదుర్గం గూబనపల్లి సమీపాన ఊరును తలపిస్తున్న జగనన్న కాలనీ

పేదలపై కక్ష సాధింపు

- ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే పట్టాల రద్దు
- మార్చి నెలాఖరు వరకు లబ్ధిదారులకు గడువు
- జగనన్న కాలనీల్లో ముమ్మరంగా సాగుతున్న సర్వే

రాయదుర్గం: పేదలపై కూటమి సర్కార్ కక్ష కట్టింది. సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకున్న వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఆర్థిక సమస్యలతో ఇళ్ల నిర్మాణం చేపట్టని వారు పట్టాలు రద్దు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మార్చి నెలాఖరు గడువు ఇచ్చింది. గత ప్రభుత్వంలో డివిజన్ పరిధిలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 160 జగనన్న కాలనీలు ఏర్పాటయ్యాయి. అందులో 24,740 మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. సుమారు 10,507 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరింది. ఆ తర్వాత ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. ఇంతలో జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రచారం మొదలు పెట్టారు. వాటిపై విచారణ పేరిట సర్వే చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో ఎంతమందికి ఇళ్ల స్థలాలు వచ్చాయి.. అందులో ఎంతమంది అర్హులు ఉన్నారు.. పట్టాలు పొందిన వారు అమ్ముకున్నారా.. అంటూ సర్వే చేస్తున్నారు. ఏదో ఒక కారణం చూపి పట్టాల రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని పేదలు గగ్గోలు పెడుతున్నారు.

అక్కసుతోనే కక్ష సాధింపు

వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న కాలనీలు చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. విద్యుత్ కాంతులు, రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీటి వసతి ఇలా అనేక మౌలిక సౌకర్యాలు కల్పించారు. కాలనీలులా కాకుండా ఊళ్లను తలపిస్తున్నాయి. ఈ మంచి శాశ్వతంగా నిలిచిపోకూడదన్న అక్కసుతోనే కూటమి సర్కార్ పేదలపై కక్షసాధింపునకు దిగుతోందని విపక్షాలు మండిపడుతున్నాయి.



పారదర్శకంగా సర్వే చేపట్టాలి

జగనన్న కాలనీల్లో అర్హత ఆధారంగా అధికారులు నిర్వహించే సర్వే పూర్తి పారదర్శకంగా చేపట్టాలి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని కోత కోయాలని చూస్తే ఊరుకునేది లేదు. ఒక్క పట్టా రద్దు చేసినా ఉద్యమించాల్సి వస్తుంది. అన్ని వర్గాలు, అన్ని మతాలు, రాజకీయ పార్టీలు అని కాకుండా అర్హత ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరిగింది.

– శారద, కౌన్సిలర్, రాయదుర్గం



లబ్ధిదారుల్లో ఆందోళన

జగనన్న కాలనీల్లో అధికారులు అనేక ప్రశ్నలతో సర్వే చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. కొత్తగా ఇంటి పట్టాలు ఇవ్వాలనుకుంటే ప్రభుత్వం స్థలం కొని లబ్ధిదారుల్ని ఎంపిక చేయాలి. అంతే కానీ పాత లేఅవుట్లపై పడడటం సరైంది కాదు. సర్వే చేస్తుండడం అందరిలోనూ అనుమానం కలుగుతోంది. పాత లబ్ధిదారులంతా పేదలనే విషయం గుర్తుంచుకోవాలి.

– వైజాగ్ రిబ్కా, రాయదుర్గం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల మండల కమిటీ నియామకాలు



కూడేరు: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల మండల కమిటీని పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంపిక చేసి పంపినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోయ కేశన్న (యువజన విభాగం అధ్యక్షుడు) ఇప్పేరు, జయమ్మ (మహిళా విభాగం) కలగళ్ల, సిద్ధారెడ్డి, (రైతు విభాగం) జల్లిపల్లి, సుబ్బయ్య (బీసీ సెల్ విభాగం) పి.నాగిరెడ్డి పల్లి, శంకర్ నాయక్ (ఎస్సీ సెల్ విభాగం)కూడేరు, సర్దార్ (మైనార్టీ విభాగం) కూడేరు, చితంబరం (క్రిస్టియన్ విభాగం) కలగళ్ల, రాగే గణేష్ (విద్యార్థి విభాగం) జల్లిపల్లి, చంద్రశేఖర్ (పంచాయతీరాజ్ విభాగం) కొర్రకోడు, పరమేశ్వర రెడ్డి (ఆర్టీఐ విభాగం) మరుట్ల-3, విజయభాస్కర్ రెడ్డి (వలంటర్ విభాగం) కూడేరు, రామాంజనేయులు (వాణిజ్య విభాగం)అరవకూరు, లక్ష్మీనరసప్ప (ట్రేడ్‌యూనియన్) కూడేరు, సంగప్ప (సాంస్కృతిక విభాగం) కమ్మూరు, లక్ష్మన్న యాదవ్ (సోషల్ మీడియా) శివరాంపేట, పెద్దన్న (వికలాంగుల విభాగం) అరవకూరు, శ్రీనివాసులు నాయుడు (ప్రచార విభాగం) మరుట్ల-2, నరసింహులు (ఎస్సీ సెల్ విభాగం) అంతరగంగను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

కూటమి పాపం పండుతోంది!

డి హీరేహాళ్(రాయదుర్గం): రాష్ట్రంలో కూటమి సర్కార్ పాపం పండుతోందని వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. డీ హీరేహాళ్ మండలం మడేనహళ్లిలో మారెమ్మ జాతర వేడుకలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రానాథ్‌రెడ్డి, బీసీసెల్ విభాగం తాలూకా అధ్యక్షుడు తొండె వెంకటేశులు, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, జల్లా కార్యదర్శి సందీప్ పాటిల్, స్థానిక సర్పంచ్ బొమ్మన్నతో కలసి ఆయన హాజరయ్యారు. అనంతరం మెట్టు విశ్వనాథరెడ్డి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులను నిండా ముంచిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయంలో రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎంతో మేలు చేకూరిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల నాటి సూపర్‌సిక్స్ హామీలు అటకెక్కించిందన్నారు. అన్నదాత సుఖీభవ ఊసే లేకుండా పోయిందన్నారు. పెట్టుబడి సాయం లేక.. ఇటు పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు విలవిలలాడే పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఎనిమిది నెలల వ్యవధిలోనే ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మార్చి నుంచి పార్టీ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎర్రిస్వామి, సూజీ మహేష్, నాయకులు మంజునాథ, కాదలూరు గంగిరెడ్డి, చింతపండు ఆంజనేయులు, సోమన్న, తిప్పేస్వామి, పులకుర్తి మంజు, హిర్డేహాళ్ శ్రీధర్, తిమ్మలాపురం జగనాథ్ పాల్గొన్నారు.



మడేనహళ్లిలో మాట్లాడుతున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

శివాజీ ఆదర్శప్రాయుడు

రాయదుర్గంటౌన్: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం రాయదుర్గంలో ఘనంగా జరుపుకున్నారు. మరాఠా సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరాఠా సంఘం గౌరవాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు శంకర్ బాబు, కార్యదర్శి హరికృష్ణ, సీనియర్ సభ్యుడు శివాజీరావు, జయసింహారావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు. పట్టణంలోని మటన్‌మార్కెట్ వద్ద అరెకటిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

కూడేరు: మండల కేంద్రంలో బుధవారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో శివాజీ మహారాజ్ కమిటీ సభ్యులు, యువకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ఛత్రపతి శివాజీ నేటి యువతకు ఆదర్శమని దొడగట్ట పాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం శివాజీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లోఓల్టేజీతో రైతులు సతమతం




ఎండిపోతున్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు

బొమ్మనహాళ్: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తామని అధికారులు గొప్పలు చెబుతున్నారు. కానీ చాలాచోట్ల విద్యుత్ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా దేవగిరి గ్రామంలో లోఓల్టేజీ సమస్య వెంటాడుతోంది. మొక్కజొన్న పంటకు మరో 20 రోజులు నీరు బాగా పారితే పంట చేతికి వస్తుందని, అయితే లోఓల్టేజీ సమస్యతో ఆ పరిస్థితి కనిపించడం లేదని గ్రామానికి చెందిన రైతులు ఆంజనేయులు, శ్రీరామ్, నాగరాజు, రవి, సంజప్ప, గోవిందు తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టాలను అర్థం చేసుకుని లో ఓల్టేజీ సమస్య తీర్చాలని కోరుతున్నారు.

స్వీయరక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కణేకల్లు: సమాజంలో బాలికలు, మహిళలపై దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో బాలికలు తమను తాము కాపాడుకునేందుకు స్వీయరక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కణేకల్లు ఇన్‌చార్జ్ సీడీపీఓ లక్ష్మి సూచించారు. కణేకల్లు జెడ్పీ బాలికల హైస్కూల్, యర్రగుంట, మోడల్ స్కూల్‌లో బుధవారం బాలికలకు స్వీయరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ ఎలాంటి కష్టమొచ్చినా బాలికలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదన్నారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్, దాడులకు పాల్పడటం లాంటివి చేస్తే ప్రాథమికంగా తప్పించుకునేందుకు మాట స్వరాన్ని పెంచి గట్టిగా మాట్లాడాలని, అలాగే ధైర్యంగా నిలబడాలన్నారు. ఒత్తిడిని జయించేందుకు మానసిక ప్రశాంతంగా కలిగి ఉండాలన్నారు. కీలక పరిస్థితుల్లో అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కరాటే శిక్షణ పొందడం వల్ల అనేక ప్రయోజనాలుంటాయన్నారు. ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు ఈ శిక్షణ ధైర్యాన్ని నింపుతాయన్నారు. వ్యక్తిగత పరిమితులపై కూడా అవగాహన పెంచడంతోపాటు భద్రత సమస్యలపై మాట్లాడే సామర్థ్యం మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మి

మృతుడి కుటుంబానికి పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: ఇటీవల పాలవాయిలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటేశులు కుటుంబాన్ని బుధవారం మాజీ ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన నందివర్ధన్‌ను పరామర్శించారు. తర్వాత తిమ్మగానిపల్లిలో లాయర్ పట్టాభి తండ్రి రామన్న అనారోగ్యంతో మరణించాడు. దీంతో వారికి ఇంటికి చేరుకుని పట్టాభి కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత బోయ తిప్పేస్వామి, మండల కన్వీనర్ గోళ్ల సూరి తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: యాటకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత గుడిసి వన్నూరప్ప(58) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య బుధవారం గ్రామానికి చేరుకుని వన్నూరప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మండల కన్వీనర్లు కన్వీనర్లు ఎమ్మెస్ హనుమంతరాయుడు, గోళ్ల సూరి, సర్పంచ్ ఈరన్న, మాజీ ఎంపీపీ రామభీమప్ప, నాయకులు శెట్టూరు తిప్పేస్వామి హరినాథరెడ్డి, ఆంజనేయులు, రామచంద్ర, వన్నూర్‌సాబ్, చాకలి హనుమంతరాయుడు, రామూర్తి, చరణ్ ఉన్నారు.



పాలవాయిలో వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తలారి రంగయ్య

కంది రైతులను ఇబ్బంది పెట్టొద్దు

కళ్యాణదుర్గం: కంది రైతులను ఇబ్బంది పెట్టకుండా సకాలంలో నగదు చెల్లించాలని ఆర్డీఓ జి.వసంత బాబు మ్యాక్స్ ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. స్థానిక మార్కెట్ యార్డులో కంది సేకరణ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సేకరించిన కందులను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా సకాలంలో రైతులకు నగదు చెల్లించాలన్నారు. అనంతరం పంట నాణ్యత, కొనుగోలు చేసిన కందులు, తేమ శాతం, ప్రస్తుతం మార్కెట్‌కు చేరిన నిల్వలు తదితర విషయాలపై మ్యాక్స్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

కంది కొనుగోలు రికార్డుల పరిశీలన

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప, అంకంపల్లి గ్రామాల్లో కందుల కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రికార్డులను కళ్యాణదుర్గం ఆర్‌డీఓ వసంతబాబు బుధవారం పరిశీలించారు. కందుల రైతులకు త్వరితగతిన నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని మార్క్‌ఫెడ్ ప్రతినిధులు, మండల అధికారులకు సూచించారు. రీసర్వే గ్రామాల్లో రైతులకు ముందస్తు సమాచారాన్ని అందించి అంగీకరించిన తరువాతనే రీసర్వే చేపట్టాలని మండల సర్వేయర్లను ఆదేశించారు. అనంతరం కందుల నిల్వ చేసిన గోదామును తహసీల్దార్ షర్మిలతో కలసి పరిశీలించారు.



మార్కెట్ యార్డులో కంది కొనుగోలును పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

పేకాటరాయుళ్ల అరెస్ట్

బెళుగుప్ప: మండల పరిధిలోని కాలువపల్లి సమీపంలో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 12 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.5,520 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివ పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

కుందుర్పి: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ తిప్పేస్వామి, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, సుశీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సీనియర్ ఉపాధ్యాయులు పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

హుండీకానుకల లెక్కింపు

బెళుగుప్ప: బూదిగుమ్మలోని హనుమంతరాయ స్వామి, పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయాల ప్రధాన హుండీలను బుధవారం లెక్కించారు. హనుమంతరాయ స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.1,36,850, పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.18,605 ఆదాయం సమకూరినట్లు మండల దేవదాయశాఖ అధికారి అక్కిరెడ్డి, ఎండోమెంట్ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి తెలిపారు.

కరకముక్కలలో 'పొలం పిలుస్తోంది'

విడపనకల్లు: మండల పరిధిలోని కరకముక్కల

సంక్షిప్త సమాచారం

గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ పద్మజ మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా డిజిటల్ గుర్తింపు కార్డు కోసం నమోదు చేయించుకోవాలని కోరారు. (రైతు విశిష్ట సంఖ్య కార్డు) డిజిటల్ గుర్తింపు కార్డు ప్రాముఖ్యనుపై రైతులకు వివరించారు. కార్డు పొందేందుకు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. క్యాక్రమంలో ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఓ సురేఖ పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయండి

రాయదుర్గంటౌన్: కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రాయదుర్గంలో సీపీఎం నాయకులతో కలిసి మాట్లాడారు. రేషన్‌కార్డు లేక అనేకమంది సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధు, తిమ్మరాజు, రవి, రమేష్, మల్లికార్జున, రామంజి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సయ్యద్ జాఫర్‌షావలి ఉరుసు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొండపై వెలసిన సయ్యద్ జాఫర్‌షావలి ఉరుసు ఉత్సవాలు బుధవారం జియారత్‌తో ముగిసాయి. ముజావర్లు ప్రత్యేక ఫాతేహా చేశారు. ఉరుసు ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మున్సిపల్ రికార్డుల వార్షిక ఆడిట్



మున్సిపల్ రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

రాయదుర్గంటౌన్: పురపాకలసంఘంలో రెండు రోజుల నుంచి మున్సిపల్ వార్షిక రికార్డుల ఆడిట్ జరుగుతోంది. జిల్లా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఉమాదేవి బృందం ఆధ్వర్యంలో ఆడిట్ సాగుతోంది. తనిఖీ అనంతరం అడిట్ నివేదికను ఆడిట్ రాష్ట్ర ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. ఇందులో ముఖ్యంగా ఆదాయం, ఖర్చులు, ఇతరాత్ర అన్ని రకాల ఆడిట్ జరుగుతుందన్నారు. సీనియర్ ఆడిటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆడిటర్లు ఖాజాబీ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, శ్యామల ఆడిట్ బృందంలో ఉన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఉరవకొండ: వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీఓ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు దరఖాస్తులను పరిశీలించారు.

కూడేరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. మండలంలో 42 యూనిట్లు ఉండగా.. 393 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన లబ్ధిదారుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుపై ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 52 యూనిట్లకుగాను 384 మంది దరఖాస్తు చేసుకోగా 322 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఈఓఆర్డీ రంగనాయకులు తెలిపారు.

66 యూనిట్లకు 197 మంది హాజరు

రాయదుర్గంటౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణ పరిధిలో 66 యూనిట్లకుగాను 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 197 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న అనంత, తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: పట్టణంలోని గోవిందరాజులు పార్వతమ్మ కల్యాణమండపంలో బుధవారం శెట్టూరు ఎంపీపీ లక్ష్మీదేవి, సోమనాథ్‌రెడ్డి కుమార్తె రమ్య, యువనందల వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఎల్ ఎం మోహన్‌రెడ్డి, మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునాథ్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వాసవి కల్యాణమండపంలో జరిగిన కంబదూరు వైఎస్సార్‌సీపీ నేత తోర్నగట్ట నారాయణప్ప కుమారుని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టడంతో ఆగిన నీటి వృథా

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: 'పైపులైన్ మరమ్మతుల్లో అలసత్వం' అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీని పరిశీలించారు. పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించారు. నీటి వృథాను అరికట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మోపిడి మేకల సిద్ధార్థ్



ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మోపిడి మేకల సిద్ధార్థ్ మండిపడ్డారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు, వజ్రకరూరు మండలాల్లో జీబీసీ, హంద్రీ-నీవా, హెచ్చెల్సీ కింద 45 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారన్నారు. ఎకరాకు రూ.2 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టి సాగు చేసినా క్వింటా మిర్చి మార్కెట్లో రూ.12 వేల నుంచి రూ.14 వేలు మాత్రమే పలుకుతోందన్నారు. గిట్టుబాటు ధర రాక రైతులు పంటను గోదాములు, కల్లాల్లో నిల్వ చేశారన్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన గిట్టుబాటు ధర రాక రైతులు ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. మిరప రైతులను ఆదుకోవడానికి గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ-క్రాప్ చేసుకున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ.1,400 ప్రీమియం చెల్లించినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలన్నారు.